క్లుప్తంగా

వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా


ఎస్సీ సత్యనారాయణ

వేటపాలెం/చినగంజాం: వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ అందించడానికి చర్యలు చేపట్టామని విద్యుత్‌శాఖ ఎస్సీ కేవీజీ సత్యనారాయణ తెలిపారు. దేశాయిపేట పంచాయతీ పరిధిలో గల విద్యుత్ శాఖ కార్యాలయంలో వేటపాలెం, చిన్నగంజాం ప్రాంత విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశం ఎస్సీ శుక్రవారం నిర్వ హించారు. రెండు మండలాల పరిధిలో వినియోగదారుల నుంచి విద్యుత్ బకాయిలే ఎక్కువగా పేరుకు పోయాయని తెలిపారు. సిబ్బంది బకాయిల వసూలుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. బకాయిలు చెల్లించని వారి కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. కొత్తగా మీటర్లు మంజూరైన వారికి 24 గంటల వ్యవధిలో మీటర్లు వారి ఇళ్లకు బిగించాలని ఆదేశించారు. గ్రామాల్లో పనిచేయకుండా ఉన్న మీటర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. వినియోగదారులు ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని పరిష్కరించాలని తెలిపారు. ఫిర్యాదులకు విద్యుత్ సిబ్బంది స్పందించకపోతే వినియోగదారులు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఎస్సీ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాసులు, ఏఈలు అరుణ, భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

పర్చూరు: పర్చూరు, కారంచేడు మండలంలోని 4 నెలలు వయసు దాటిన అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు ఏడీ డీ మాధవి తెలిపారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు పశుపోషకులు 7 నెలల నిండిన చూడి పశువులకు కూడా టీకాలు వేయించుకోవాలని ఆమె తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవీ క్లాత్ మార్కెట్‌లో ఏలూరి హాస్పిటల్స్ గుంటూరు వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఆర్థో, న్యూరాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్స్‌కు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పెన్షనర్లు, పట్టణ ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారత్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆదాము


ఆదాము

అద్దంకి రూరల్: భారత్ సమాజ పార్టీ జాతీయ అధ్యక్షుడు చింతాడ సూర్యం నుంచి శుక్రవారం పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్నట్లు వాడెల ఆదాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

దాతల చేయూత అభినందనీయం


మెటీరియల్ అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్

బల్లికురవ: విద్యాభివృద్ధికి ట్రస్ట్ తరుపున రూ. 10 వేలు విలువ చేసే అట్లాస్‌లు లైబ్రరీ పుస్తకాలు అందించటం అభినందనీయమని కొప్పరపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీ. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అద్దంకికి చెందిన పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరుపున మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి పాఠశాల పీడీ యం విష్ణు ప్రసాద్, పీఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటా ఇస్తే.. బిల్లులు ఇస్తాం

- ట్రెజరీలో లంచాలు ఇవ్వాలంటూ అంగన్‌వాడీలపై ఒత్తిడి
- 10 శాతం డబ్బులు ఇవ్వాల్సిందే


పంగులూరులోని అంగన్‌వాడీ కేంద్రం

జే.పంగులూరు: అధికారులు బాగా ముదిరిపోయారు. కిందిస్థాయి ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న బిల్లులను సరి చూసి ఇవ్వాలే తప్పా.. నాకు కొంచెం వాటా కావాలనుకోవడం ఏంటో అర్థం కావడం లేదు. మీరు ఏమైనా చేసుకోండి మీ బిల్లులు కావాలంటే ట్రెజరీలో కొంత ముట్టజెప్పాలి.. అందుకోసం బీ బిల్లులో 10 శాతం డబ్బును ఇవ్వాల్సిందే అంటూ అంగన్‌వాడీలపై అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక రకాల్లో చిన్నచిన్న బిల్లులు పెట్టుకునే అవకాశం ఉంది. పిల్లల అన్నప్రాశన, సీమంతాలు, అక్షరాభ్యాసాలు, ప్రజారోగ్య కార్యక్రమాలు ఇలాంటి వాటిని కమ్యూనిటీ బెస్ట్ ఈ వెంట్స్ (సీబీఈ) అంటారు. ఇవి ప్రతి నెలలో రెండు కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలి. కార్యక్రమాలు చేసినందుకు ఒక్కో కార్యక్రమానికి రూ. 250 ప్రభుత్వం ఇస్తుంది. నెలలో రెండు కార్యక్రమాలు చేయడం వలన రూ.500 వస్తాయి. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో పెట్టే భోజనంలో వాడిన కూరగాయలకు విద్యార్థికి ఒక్కొక్కరికి రోజుకు రూ. 1.50 పైసలు, బాలింతలు, గర్భిణులకు రూ. 1.75 పైసలు చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. ఇక ప్రభుత్వం చేసే పనులను సెల్‌ఫోన్లో బాగా చేసిన అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ. 500 ఇస్తారు. ఇవి మొత్తం కలుపుకొని నెలకు రూ. 2500 వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి వస్తాయి. ఈ డబ్బులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వం ఇస్తుంది.

డబ్బులు ఇవ్వకపోతే.. కదలని ఫైళ్లు

ఈ డబ్బులు ట్రెజరీ ద్వారా బిల్లు చేయించాల్సి ఉంటుంది. అయితే ట్రెజరీలో ఈ బిల్లులు చేయాలంటే కొంత ముట్టజెప్పాలని, ఇందుకోసం ఇచ్చే బిల్లులో 10 శాతం డబ్బులు తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని అంగన్‌వాడీ టీచర్లపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కొరిశపాడు, పంగులూరు, అద్దంకి మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల పరిధిలో 202 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఒక్కో కేంద్రం నుంచి నెలకు రూ. 2500 బిల్లుకు 10 శాతం రూ. 250 చొప్పున రూ. 50 వేలు పైగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వసూలు చేస్తున్నారు. 10 శాతం వసూళ్లకు అక్కడక్కడ కొంతమంది ఏజెంట్లను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే గుడ్లు, పాలు, బియ్యం, పప్పులు, నూనె ఇలా అనేక వాటిలో వాటాల వసూలు చేసే అధికారులు ఇప్పుడు నేరుగా అంగన్‌వాడీ టీచర్లకు వచ్చే బిల్లులోనే వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఇప్పటికైనా వీరి కష్టాన్ని గుర్తించి బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

> **అన్ని అవాస్తవాలే..**
> అంగన్‌వాడీల వద్ద నుంచి ఒక్కో సెంటర్‌కు బిల్లు పెట్టాలంటే 10 శాతం డబ్బులు వసూళ్లు చేయడం అనేది అవాస్తవం. అంగన్‌వాడీలకు ప్రభుత్వం వద్ద నుంచి రావాల్సిన బిల్లులు అన్ని కచ్చితంగా ఉంటే.. కార్యక్రమాలు చేసి ఉంటే బల్లులు ఎలాంటి అవకతవకలు లేకుండా ఇస్తున్నాం. వసూళ్లు చేయడం అనేది నిజం కాదు.
> – క్రిష్ణకుమారి, సీడీపీవో

> **10 శాతం డబ్బులు నిజం కాదు**
> అంగన్‌వాడీలకు రావాల్సిన బిల్లులు ఎలాంటి అవకతవకలు లేకుండా ఇస్తాం. రావాల్సిన వాటికి బిల్లులు సక్రమంగా ఉంటే ట్రెజరరీలో బిల్లుపాస్ చేస్తాం. అంతేకాని ఏ ఒక్కరిని డబ్బులు డిమాండ్‌చేసేంది ఏమి ఉండదు. ఇవన్నీ అవాస్తవాలు మాత్రమే.
> – కొండలరావు, సీనియర్ అకౌంటెంట్

పంట నష్టం అంచనాలు తయారు చేయాలి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, అధికారులు

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: పంట నష్టం అంచనాలను వెంటనే తయారు చేయాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన శుక్రవారం సంతమాగులూరు మండలంలోని, సంతమాగులూరు, కొమ్మాలపాడు, పాతమాగులూరు గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న, మిరప, బొప్పాయి, అరటి పంట పొలాలను పరిశీలించారు. పైగ్రామాలే కాకుండా, మిన్నెకల్లు, సజ్జాపురం గ్రామాల్లో మొత్తం 500 ఎకరాల్లో మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని ఏవో లావణ్య చైతన్యతో చెప్పారు. ఈ-క్రాప్ ఎంత నమోదు అయింది.. ఏయే పంటలకు నష్టపరిహారం వచ్చే అవకాశం ఉందనే వివరాలను ఏవో చైతన్యకు వివరించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నష్టపరిహారం అంచనాలు త్వరగా తయారు చేసి నష్టపోయిన రైతులకు అన్ని విధాలా అదుకునే విధంగా చూడాలని చెప్పారు. మిరపకాయలు ఎండబెట్టుకునేందుకు కల్లాలను ఏర్పాటు చేయించాలని రైతులు కోరారు.

పంట నష్టాలపై నివేదిక ఇస్తాం..

బల్లికురవ: అకాల వర్షాల దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామని మార్టూరు వ్యవసాయశాఖ ఏడీఏ కెవీ శ్రీనివాసరావు శుక్రవారం మండలంలోని గుంటుపల్లి, అంబడిపూడి నక్కబొక్కలపాడు, కోణిదెన గ్రామాల్లో గురువారం కురిసిన భారీ వర్షానికి ఈదురుగాలికి నేలవాలిన మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. ఈ పంటలో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు వీఏఏలు పంటను పరిశీలిస్తారని ఏడీఏ చెప్పారు. పరిశీలనలో ఏవో ఎస్‌వీపి కుమారి సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు గ్రామాల్లో కల్లాల్లో ఎండబోసిన ఎండు మిర్చికి కూడా నష్టం వాటిల్లిందని చెప్పారు.


అరటి తోటలను పరిశీలిస్తున్న వైద్య అధికారులు


గుంటుపల్లిలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారుల బృందం


సోమవరప్పాడులో మిరప కల్లాల్లోకి చేరిన వర్షపు నీరు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తున్న దాతలు

పర్చూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో నాగులపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, నాగుబడి రంగయ్య, అచ్చమ్మ బధిరుల పాఠశాల, పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు నర్రా వెంకట లక్ష్మీ సుధ ఆర్థిక సహాయంతో శుక్రవారం ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పర్చూరు విద్యాశాఖాధికారి డీ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష రాసే విధానం, మెళుకువలు గురించి తెలియజేశారు. దాతలకు క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వంబి సదానందరెడ్డి, సభ్యులు తోకల కృష్ణమోహన్, పాబోలు వెంకన్న, చంద్రం, కొల్లా నరేంద్ర కుమార్, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్, రమేష్ చంద్ర, పాఠశాల హెచ్‌ఎంల , విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో క్షయ అందనంత దూరం


స్వర్ణలో అవగాహన ర్యాలీ చేస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది


మార్టూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కారంచేడు: మన ఊరి నుంచి, మన ప్రాంతం నుంచి క్షయ వ్యాధిని తరిమికొడదామని కారంచేడు, దగ్గుబాడు, స్వర్ణ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ జెస్సీరాణి, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ హస్మప్రియలు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ క్షయ (టీబీ) నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం కారంచేడు పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పెదబజారు, చినవంతెన సెంటర్‌ల మీదగా కాలువ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సువర్ణజ్యోతి, హెచ్‌వీలు వసంతవల్లి, వీరమ్మ, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది హైస్కూల్ మీదగా మొయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించి బ్యాంక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి వ్యాధి తీవ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బయ్యా శంకర్, మల్లేశ్వరి, అశ్విని, జోత్స్న, నాగలక్ష్మి, సౌజన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. దగ్గుబాడు పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో నూతలపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శి, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మార్టూరు: క్షయవ్యాధి నివారణే లక్ష్యంతో మార్టూరు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం మార్టూరులో నినదించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని వీధుల వెంట ప్రదర్శన నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా సౌజన్య


జిల్లా అధికారుల నుంచి అవార్డు తీసుకుంటున్న సౌజన్య

దగ్గుబాడు(కారంచేడు): బాపట్ల జిల్లాలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా మండలంలోని దగ్గుబాడు పీహెచ్‌సీకి చెందిన ఎల్‌టీ సౌజన్య ఎంపికయ్యారు. శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ సీవీ రమాదేవిల చేతుల మీదగా ఆమెకు ఈ అవార్డును బహూకరించారు. కళ్లె, రక్త, యూరిన్ వంటి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనపబరచినందుకు సౌజన్యకు బెస్ట్ అవార్డు కింద ప్రశంస పత్రం అందించారు. దీంతో ఆమెను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, డాక్టర్ కృష్ణకుమార్, పీహెచ్‌ఎన్ రూతమ్మ, హెచ్‌వీలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

చినగంజాం: సామాజిక సేవలో కెనరా బ్యాంకు ముందుంటుందని విజయవాడ సర్కిల్ కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తాడికొండ మల్లికార్జునరావు అన్నారు. బ్యాంక్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.90 వేలు విలువ కలిగిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను మండలంలోని కడవకుదురు కెనరా బ్యాంక్ ద్వారా పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేయగా శుక్రవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం పాఠశాల నూతన భవనంలో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆయన పూజ కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల హెచ్‌ఎం డీ రత్నకుమారి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా సామాజిక కార్యక్రమాన్ని చేయాలనే ఉద్దేశంతో పాఠశాల పూర్వవిద్యార్థి వలివేటి మురళీకృష్ణను సంప్రదించగా ఆయన ఇచ్చిన సలహా మేరకు పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డీ గంగాధర్, గీతా ట్రస్ట్ ఎండీ వలివేటి మురళీకృష్ణ, కెనరా బ్యాంక్ ఒంగోలు డీఎం బాల సుబ్రమణ్యం, కడవకుదురు బీఎం దాసరి మెర్సీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పంట ధ్వంసంపై కేసు

మేదరమెట్ల: పంటను ధ్వంసం చేసిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. 20వ తేదీ సోమవారం కొరిశపాడు మండలంలోని బొల్లవరప్పాడు గ్రామంలోని తూమాటి కళావతి పొలంలో గన్నమనేని వేణు మరో ముగ్గురు పంట పొలంలోకి అక్రమంగా చొరబడి ట్రాక్టర్‌తో పొలంలోని పంటను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా చంపుతామని బెదించారని కళావతి ఫిర్యాదు పోలీసులకు చేసింది. ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవాలు


అలంకరణలో అమ్మవారు


ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న కృష్ణచైతన్య, గరటయ్య

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం ప్రతిష్ట మహోత్సవాలను వేదమంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహించారు. శైవగమన పండితుడు గూడూరు మోహనశర్మ బృందంచే ఉదయం 7 గంటలకే పీఠన్యాసం , రత్నన్యాసం, యంత్ర స్థాపన, బింబస్థాపన తదుపరి 9.54 గంటలకు పోలేరమ్మ నాంచారమ్మ, గంగమ్మ, పోతురాజు, శిఖర మూలవిరాట్‌లను ప్రతిష్ఠించారు. సుమారు 10 వేల మందికి అన్నదానం చేపట్టారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే చెంచు గరటయ్యతో కలిసి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో పార్టీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, జెడ్పీటీసీ చింతల అంజలి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణారావు, సర్పంచ్ యర్రశాంతమ్మ స్థానిక నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ కృష్ణ, తదితరులు

చినగంజాం: ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పెదగంజాం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ తహసీల్దార్ పీ బ్రహ్మయ్యకు శుక్రవారం విన్నవించారు. పెదగంజాం సర్వే నంబర్ 551/1, 552/1లోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యల్లావుల తిరుపతిరావు, గ్రామపెద్దలు యల్లావుల వెంకటేశ్వర్లు, గడ్డం నాగయ్య, యల్లావుల చిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దాతల విరాళాలతో ఈద్గా ప్రహరీ నిర్మాణం


ఈద్గా వద్ద పనులు పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఈద్గాకు పవిత్ర రంజాన్ మాస్ ఆరంభంలో దాతల సహాయంతో శుక్రవారం ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిచారు. రంజాన్ మాసంలో ప్రార్థనలకు అసౌకర్యంగా ఉంటున్న నేపథ్యంలో తరతమ బేధాలు లేకుండా ముస్లింలు అంతా ఏకాభిప్రాయంతో ఈద్గా అభివృద్ధికి పూనుకోవటం విశేషం. వీటి కోసం రూ.12 లక్షలు నిధులు అవసరమవుతాయని అంచనాలు రూపొందించగా ముస్లింలు తక్షణమే స్పందించి రూ.8 లక్షలు వరకు మొదటి రోజున సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎంబీ బుడే రూ.1 లక్ష, స్థానిక బిస్మిల్లా టెంట్ హౌస్ యజమాని కుందుర్తి గఫూర్ ఖాన్ రూ.1 లక్ష, గన్నవరం బుడే, కారుచోల సులేమాన్ రూ.50 వేలు, చొప్పున, మండల కనీ్వనర్ పఠాన్ కాలేషావలి రూ.25 వేలు, మొత్తం రూ.8 లక్షలతో పనులు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. దాతల విరాళాల అనంతరం రూ.12 లక్షలకు ఎంత మొత్తం తక్కువైతే అంత మొత్తాన్ని తాను అందించనున్నట్లు ఎస్‌ఎంబీ బుడే తెలిపారు. పనులను షేక్ రషీద్, మక్తుం బాషా, గడ్డం మస్తాన్ వలి, కుందుర్తి గఫూర్‌ఖాన్‌లు పర్యవేక్షిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ ముప్పాళ్ల సుబ్బారావుపై రాజమండ్రిలో పోలీసులు అక్రమ కేసు పెట్టినందుకు నిరసనగా ఒంగోలు బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాగంటి జ్ఞానేశ్వరరావు, నీలి కస్తూరినాథ్‌లు మాట్లాడారు. రాష్ట్రంలోని ఏదో ఒక ప్రాంతంలో నిరంతరం న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వాలు తక్షణమై అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని వారు కోరారు.

నేడు కొత్తపాలెం మార్కెట్‌లో వేలం

చినగంజాం: కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో అమ్మకందారుల నుంచి పంచాయతీ రుసుము వసూలు చేసుకునేందుకు 2023-24 సంవత్సరానికి సంబంధించి బహిరంగ వేలం 25వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎం బాబురావు ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాల్సినవారు రూ.3 లక్షలు అంతకు మించి విలువ గల సాల్వెన్సీ సర్టిఫికెట్, నిర్ణీత ధరావత్తు పైకం పాట సమయానికి ఒక గంట ముందు చెల్లించాలన్నారు. పాటలో రూ 20 వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. కోర్టు కేసులు, క్రిమినల్ కేసులు ఉన్నవారు పాటలో పాల్గొనేందుకు అర్హులు కారని ఆయన తెలిపారు.